క్లుప్తంగా

దమ్మపేట వాసికి ప్రశంసాపత్రం

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేసినందుకు గాను దమ్మపేట మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిల నరసింహారావు (నర్సీ), తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షీ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో దీనిని అందుకున్నారు. రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి, రాజ్యసభ ఎంపీ నాసీర్‌హుస్సేన్ పాల్గొన్నారు.

నియమాలు పాటించండి

భద్రాచలంటౌన్: వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని భద్రాచలం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తోట తిరుపతి తెలిపారు. 35వ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం మ్యాజిక్, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. డ్రైవర్లు ఆటోలు నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాలను అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది భాస్కర్ పాల్గొన్నారు.

సాగుభూముల జోలికి రావొద్దు

ములకలపల్లి: ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూముల జోలికిరావద్దని సీపీఐ రాష్ట్రసమితి సభ్యుడు నరాటి ప్రసాద్ అన్నారు. ములకలపల్లి శివారులోని కొమరంభీంనగర్‌లో బుధవారం నిర్వహించిన పోడుసాగుదారుల సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా అడవినే జీవనాధారంగా బతుకు సాగిస్తున్న గిరిజనుల భూములను లాక్కునే ప్రయత్నాలకు పాల్పడితే సహించేదిలేదని స్పష్టం చేశారు. సీపీఐ నాయకుడు రమేశ్, వీరూనాయక్, సాయి, ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలి

మణుగూరురూరల్: రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా నాయకులు సత్రపల్లి సాంబశివరావు, ఉప్పుతల నర్సింహారావు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పగిడేరు, బయ్యారం, అంబేడ్కర్ సెంటర్ అడ్డాలలో కరపత్రాలతో విస్తృత ప్రచారం చేసి ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రవాణా రంగ కార్మికుల సమస్యలపై నేడు సామూహిక ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి, కృష్ణారావు, సాయికుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నేడు తలపెట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమంను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల నాయకులు కొమరం కాంతారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

పదవీకాలం పొడిగించాలి

పినపాక: సర్పంచ్‌ల పదవీ కాలాన్ని పొడిగించాలని కోరుతూ మండలంలోని పలువురు సర్పంచ్‌లు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులను కలసి విజ్ఞప్తి చేశారు. అనంతరం సర్పంచ్‌లు మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. పూర్తి నిధులు విడుదలయ్యే వరకు కాలపరిమితిని పొడిగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొగ్గల నాగేశ్వరరావు, కల్యాణి, కష్ణంరాజు, సుధాకర్, నాలి మహేష్, నూప నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల సంతాపం

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్ ప్రాంతానికి చెందిన ఎక్స్‌ప్లోజివ్ కార్మికుడు గుండె యాకయ్య తండ్రి సోమయ్య(90) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందడంతో.. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు జంగం మోహన్‌రావు, సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.లక్ష్మీనారాయణలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సీపీఐ జిల్లా నాయకులు ఎస్‌కె.సర్వర్, ఏఐటీయూసీ మండల కార్యదర్శి తోట రమేష్, కార్యవర్గ సభ్యులు అధర్ల రాములు, బాబురావు, మాధవరావు, ఎర్రయ్య, నరసింహరావు పాల్గొన్నారు.

అండగా ఉంటాం..

గుండాల: ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన గ్రామపంచాయతీ కార్మికుని కుటుంబానికి అండగా ఉంటామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపినట్లు కాంగ్రెస్ మండల నాయకులు ఎస్.ఖదీర్ అన్నారు. నాయకులు బుధవారం పార్థీవ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. విషయాన్ని ఫోన్‌లో ఎమ్మెల్యేకు వివరింగా.. తగిన న్యాయం చేయాలని అధికారులను ఆయన ఆదేశించినట్లు ఖదీర్ తెలిపారు. ముత్తాపురం సర్పంచ్ పూనెం సమయ్య, రోళ్లగడ్డ సర్పంచ్ అజ్మీరా మోహన్, ఎంపీటీసీ కల్తి కృష్ణారావు, టీడీపీ, టీజేఎస్, సీపీఐ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఓటే ప్రజాస్వామ్యానికి పునాది!

- మంచి నాయకులకు ఎన్నుకునేందుకు అందరికీ అవకాశం
- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- యువతలో చైతన్యం నింపడమే లక్ష్యంగా కార్యక్రమాలు

కరకగూడెం: ప్రజాస్వామిక భారతదేశంలో ప్రతి పౌరుడికి కుల, మత, లింగ, వర్గ, ప్రాంతీయ భేదం లేకుండా ఓటు వినియోగించుకునే హక్కు ఉంది. సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడంపైనే దేశ, రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. రాబోయే తరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా ఓటుహక్కు విలువ తెలిసేలా అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతీ ఒక్కరిపై ఉంది. ఓటు హక్కు పొందేలా యువతరాన్ని ప్రోత్సహించేందుకు మన దేశంలో ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 2011 నుంచే ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించుకుంటున్నాం. యువత రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యేలా చూడాలన్నదే జాతీయ ఓటర్ల దినోత్సవ లక్ష్యం.

యువతలో పెరిగిన ఆసక్తి

18 ఏళ్లు నిండిన యువత ఓటుహక్కు పొందేందుకు ప్రస్తుతం ఆసక్తి చూపుతున్నారు. యువత చైతన్యం నింపే దిశగా అడుగులు వేయడం, అర్హత మేరకు ఓటర్ల జాబితాను రూపొందించడమే జాతీయ ఓటర్ల దినోత్సవం ప్రధాన ఉద్దేశం. అందులో



కరకగూడెంలో ఓటు ప్రాముఖ్యత తెలియజేసేలా ఏర్పాటు చేసిన హోర్డింగ్

భాగంగా ఏ ఒక్క ఓటరునూ విడిచి పెట్టకూడదన్న నినాదంతో ఎలక్షన్ కమిషన్ పనిచేస్తోంది.

ఓటు హక్కు.. మార్పులు, చేర్పులు

అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవాలంటే దరఖాస్తుదారుడు ఫామ్ 6ను నింపి నిర్ణీత ప్రదేశంలో ఫొటో అంటించి, వయసు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలతో కలిసి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు అందజేయాల్సి ఉంటుంది. విదేశాల్లో నివసించే ప్రవాస భారతీయులు కూడా ఫామ్ 6ఏ ను నింపి సంబంధిత అధికారికి అందజేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నమోదు చేసుకున్న వ్యక్తి పోలింగ్ బూత్ పరిధిపై అభ్యంతరాలుంటే ఫామ్ 7ను నింపి స్థానిక తహసీల్‌లో ఇవ్వొచ్చు. పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు, చిరునామా తదితర అంశాల్లో తప్పొప్పులను సరిదిదిద్దుకునే వీలుంది. చిరునామా మార్పు కోసం ఫామ్ 8ఏ పూరించి సంబంధిత అధికారులకు అందించాల్సి ఉంటుంది. ఆన్లైన్‌లోనూ ఓటరు నమోదుకు సంబంధిత ఫారాలను నింపి అధికారులకు సమర్పించే వీలుంది. నెట్లోనే సంబంధిత వివరాలు అన్నీ పూర్తి చేసి ఫొటో, ఇతర డాక్యుమెంట్లను స్కాన్ చేసి పంపిస్తే అధికారులు నిర్ణీత వ్యవధిలో ఓటు హక్కును కల్పిస్తారు. ఈ సేవా కేంద్రంలో ఎపిక్ నంబరును చెప్పి ఓటరు గుర్తింపు కార్డును పొందొచ్చు.

వ్యక్తిగత లాభం పనికిరాదు..



ఎన్నికల సమయంలో నాయకులు ప్రలోభాలకు గురిచేయడం సహజమే. అయితే కేవలం వ్యక్తిగత లాభం కోసం ఆశపడి ఓటును దుర్వినియోగం చేయను. సమాజానికి, అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేయగలడనే నమ్మకం ఉన్నవారికే ఓటును వేస్తాను. 18 సంవత్సరాలు రాగానే విధిగా ఓటుహక్కు నమోదు చేసుకున్న.

– పఠాన్ అతిక్ ఖాన్, నూతన ఓటర్, పద్మాపురం

ఓటు విలువను గుర్తించాలి



ఓటు హక్కును తక్కువగా భావించొద్దు. మన భవిష్యత్ రూపొందించి మనకోసం పని చేసే నాయకుడిని ఎన్నుకునేందుకు ఇది దోహదపడుతుంది. అలాంటి ఓటు విలువను అందరూ గుర్తించాలి. ఇతరులకు తెలియజెప్పాలి. అవినీతిని నిర్మూలించడం మనచేతుల్లోనే ఉంది. ఇందుకోసం ఓటు అనే ఆయుధాన్ని వినియోగించాలి.

– రాజారాం, ఎస్సై, కరకగూడెం

అందరూ వినియోగించుకోవాలి



ఓటుహక్కును అందరూ తప్పకుండా వినియోగించుకోవాలి. మనం ఒక్కరం ఓటు వేయకపోతే నష్టమేంటన్న భావన వీడాలి. ఆ ఒక్కటే నేతల భవితవ్యాన్ని, మన అభివృద్ధిని నిర్ణయించవచ్చు. అయిదేళ్ల జీవితానికి ఒక నాయకుని ఎన్నుకోవాలంటే మనం ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి. విలువైన ఓటును తాకట్టు పెట్టుకోవద్దు.

– కె.చంద్రశేఖర్, తహసీల్దార్, కరకగూడెం

విద్యార్థులు ఇష్టపడి చదవాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు

భద్రాచలంటౌన్: విద్యార్థులు భయంతో చదవకుండా ఇష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అవరోధించవచ్చని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ పాఠశాల, కళాశాలను ఎమ్మెల్యే బుధవారం సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని సూచించారు. టెన్త్ విద్యార్థులు పరీక్షల విషయంలో ఆందోళన చెందకుండా వారిలో ఉత్సాహాన్ని నింపే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పాఠశాల, కళాశాలల అడ్మిషన్ల కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పట్టణంలో నిర్వహించిన అడ్మిషన్ ర్యాలీకి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ లాల్ హట్కర్, పాఠశాల, కళాశాల అధ్యాపక, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ నం.55ను రద్దు చేయాలి

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ, హార్టీకల్చర్ యూనివర్సిటీలకు సంబంధించిన వంద ఎకరాలను నూతన హైకోర్టు భవనాల నిర్మాణాలకు కేటాయించడం తగదని, తక్షణమే ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 55ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు ప్రధాన గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గేటు వద్ద బైఠాయించి జీవోను రద్దు చేయాలని వారంతా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ.. యూనివర్సిటీ భూములను హైకోర్టు భవనాల నిర్మాణాలకు కేటాయించడం వల్ల యూనివర్సిటీలో జీవవైవిద్యం దెబ్బతినే


వ్యవసాయ కళాశాల ప్రధాన గేటు వద్ద బైఠాయించిన విద్యార్థులు

ప్రమాదం ఉందని అన్నారు. కార్యక్రమంలో మంద నాగకృష్ణ, సీహెచ్ రామ్ చరణ్, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

యాత్రను అడ్డుకోవడం అప్రజాస్వామికం

పినపాక: రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్రను అడ్డుకోవడం దారుణమని పినపాక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథ అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ఈ బయ్యారం క్రాస్‌రోడ్‌లో ధర్నా నిర్వహించారు. ప్రధాని మోదీ నియంతత్వ పాలనకు యాత్రను అడ్డుకోవడం నిదర్శనం అన్నారు. అడ్డుకున్న బీజేపీ మూకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర చండీయాగం

అశ్వారావుపేట: స్థానిక వీకేడీవీఎస్ రాజు కళాశాల ఆవరణలో భక్తిశ్రద్ధలతో సహస్ర చండీయాగాన్ని నిర్వహించారు. ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం పూజ్య శ్రీ గురూజీ అమృతానంద నాథ సరస్వతి, కామాఖ్యామృత శోధన ఆధ్వర్యంలో 108 హోమ కుండములలో సహస్ర చండీ హోమాన్ని జరిపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషుబాబు, రామమూర్తి, సాయికుమార్, ముత్తా సుమాకర్, చవ్వా రమేష్, ఎం.బ్రహ్మ శాస్త్రీ పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం


మణుగూరురూరల్: డ్రైవర్‌ను సన్మానిస్తున్న సీఐ రమాకాంత్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన డ్రైవర్స్ డే వేడుకల్లో భాగంగా విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లను బుధవారం భద్రాచలం పట్టణ సీఐ నాగరాజు రెడ్డి ఘనంగా సన్మానించారు. ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు రెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలు పాటిస్తూ.. ప్రమాదాల నివారణకు కృషి చేయాలని డ్రైవర్లకు సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రామారావు, ఆర్టీసీ సీఐ గౌతమి, వెంకటేశ్వర్లు, అల్లం నాగేశ్వరరావు, దుర్గాచారి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: డ్రైవర్స్ డే సందర్భంగా పట్టణంలోని సురక్షాబస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ ఉత్తమ డ్రైవర్ ఎ.అప్పారావును మణుగూరు సీఐ ఏ.రమాకాంత్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలను చేర్చే బాధ్యత ప్రతీ డ్రైవర్‌పై ఉంటుందన్నారు. డ్రైవర్లు ఎప్పటికప్పుడు అప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ విధులను అంకిత భావంతో నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

టీవీ బహూకరణ

గుండాల: ఆస్ట్రేలియాలో నివాసం ఉంటున్న ఉషా–రామ్‌లు ఆళ్లపల్లి మండలం తునికి బండల పాఠశాలకు 50 వేల విలువచేసే టీవీ బహూకరించారు. ఉషా–రామ్ దంపతుల కుమారుడు విశ్వమహాదేవ్ మొదటి పుట్టిన రోజు సందర్భంగా అరుణ హీర్యా సహకారంతో టీవీ అందించినట్లు పాఠశాల హెచ్ఎం నరేష్ బుధవారం తెలిపారు.

క్రీడా పోటీలు

కరకగూడెం: మండలంలోని అనంతారం జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల హెచ్ఎం.రఘురాం ప్రసాద్ మాట్లాడుతూ.. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల స్థాయిలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రాజా, లక్ష్మణ్ సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జహీరుద్దీన్

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ములకలపల్లికి చెందిన ఎండి.జహీరుద్దీన్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.

పరిశుభ్రతపై అవగాహన

చర్లరూరల్: చర్ల మండలంలోని ఏజెన్సీ గ్రామమైన రాళ్లపురం గ్రామంలో బుధవారం వైద్య ఆరోగ్య సిబ్బంది పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. గర్భిణులకు, అప్పుడే పుట్టిన పిల్లలకు మొదలుకొని 15 సంవత్సరాల పిల్లల వరకు టీకాలు వేశారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి కావలసిన మందులు అందించారు. నీటి నిల్వలను ప్రతి శుక్రవారం, మంగళవారం ఖాళీ చేసి నీళ్లను పట్టుకోవాలని సూచించారు. సిబ్బంది వేణుగోపాల కృష్ణ, రాంప్రసాద్, రమ్య, స్వరూప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో వైద్యశిబిరం

మణుగూరురూరల్: మండలంలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ 68మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేసి దగ్గు, జలుబు, జ్వరం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి నివారణ మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి శివకుమార్ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అనసూర్య, రవి, శ్రీకాంత్, ఉష పాల్గొన్నారు.

పూజారులతో సమావేశం

దమ్మపేట: మండలంలోని సరోజనాపురం గ్రామంలో గిరిజన పూజారులతో కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సామేలు సమావేశం నిర్వహించారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన పూజారులకు గౌరవవేతనంగా రూ.10వేలు ఇవ్వాలని కోరుతూ మంత్రులకు వినతిపత్రాలను అందజేస్తామని తెలిపారు.

దోస్త్ బ్రోచర్లు ఆవిష్కరించిన కలెక్టర్

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2024 అడ్మిషన్లకు సంబంధించి దోస్త్ బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల బుధవారం సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించాలని, అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని అన్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు అందించే కోర్సులు వివరాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకుని అభినందించారు. కార్యక్రమంలో దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ సల్లా రమేష్‌బాబు, అధ్యాపకులు డాక్టర్ మహమ్మద్ కరీం, డాక్టర్ పి.భాస్కర్‌రావు, కళాశాల సిబ్బంది ఎండి.దిలావర్ హుస్సేన్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

భద్రాచలంటౌన్: జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్


మణుగూరురూరల్: దోస్త్ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక అల

పోటీల్లో బంగారు పతకం సాధించిన భద్రాచలం పట్టణానికి చెందిన సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారుడు గాలి రామ్మోహన్ రావును కలెక్టర్ ప్రియాంక అల అభినందించారు. బుధవారం తన చాంబర్‌లో కలిసిన క్రీడాకారులతో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో జిమ్ కోచ్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో రాణించాలి


అశ్వారావుపేట: బాలికా దినోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు

భద్రాచలంటౌన్: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించి అందరికి ఆదర్శంగా నిలవాలని భద్రాచలం టౌన్ ఎస్సై విజయలక్ష్మి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ బాలిక దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల హెచ్ఎమ్ రమా, సీడీపీఓ సలోమి, డాక్టర్ సూరపనేని క్రాంతి, రూప, అరుణ పాల్గొన్నారు.

అశ్వారావుపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హరిత మాట్లాడుతూ.. బాలికలు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉండాలని అన్నారు. ఉపాధ్యాయులు, సీఆర్పీ ప్రభాకరాచార్యులు పాల్గొన్నారు.

గుండాల: ఏజెన్సీ ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థినులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అరుణ కుమారి అన్నారు. బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆళ్లపల్లి మండలం అనంతోగు కస్తూర్బా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాలలో డాన్స్ పోటీలో నిర్వహించారు. ఉపాధ్యాయ, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం సాధించేవరకూ విశ్రమించొద్దు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: విద్యార్థి దశలో ప్రత్యేక లక్ష్యాన్ని నిర్దారించుకుని, ఆ లక్ష్యం సాధించేవరకూ విశ్రమించవద్దని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఎర్రగుంట గ్రామానికి చెందిన వీరమనేని పూర్ణచందర్ రావు సహకారంతో వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం జగన్నాథపురం హైస్కూల్, ములకలపల్లి కస్తూర్బా పాఠశాలల్లో నిర్వహిస్తున్న నైపుణ్య శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లక్ష్య సాధనలో ఎన్ని అవరోధాలు ఎదురైనా వెనుకడుగు వేయవద్దని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ తాటి తులసి, సర్పంచ్ కారం సుధీర్, అడపా నాగేశ్వరరావు, కొప్పుల రాంబాబు, సురభి రాజేశ్, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ వచ్చే నెల 16వ తేదీన నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ రైతులు, కార్మికులను కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో బుధవారం జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు కేసుపాక నరసింహారావు, రామకృష్ణ, మూల అప్పన్న, భారతి, వేల్పుల ముత్తారావు, మహేష్, నందు, తిరుపతమ్మ, భూదెమ్మ పాల్గొన్నారు.

చర్ల: కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఫిబ్రవరి 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మాచారి, సీఐటీయూ జిల్లా కోశాధికారి పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని బీఎస్ రామయ్య భవన్‌లో సీఐటీయూ మండల కన్వీనర్ పాయం రాధాకుమారి అధ్యక్షతన జరిగిన సీఐటీయూ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎం.విజయశీల, వివిధ రంగాలకు చెందిన నాయకులు పృథ్వీ, విజయ


మాట్లాడుతున్న పిట్టల అర్జున్

రాజు, ముకుంధరావు, సమ్మక్క, పుష్ప నాగమణి, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

విద్యావైజ్ఞానిక సభలు..

భద్రాచలంటౌన్: ఖమ్మంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 11,12న జరిగే విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ దర్శిని సంపాదక వర్గ సభ్యుడు మునిగడప రామాచారి అన్నారు. పట్టణంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో బుధవారం మహాసభలకు సంబంధించిన గోడపత్రిక, స్టిక్కర్లు, ఆహ్వాన పత్రికలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బి.రాజు, హరిలాల్, ప్రసాదరావు, ఉమాదేవి, ముత్తయ్య, రాములు, నాగభూషణం, ముత్తయ్య, రమేష్, లక్ష్మి, చంద్రకళ, రాణి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ముమ్మర తనిఖీలు

పలు ప్రాంతాల్లో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. పెండింగ్ చలానాలు, హెల్మెట్ లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి అవగాహన కల్పించారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని వాహనాలపై చలానాలు విధించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్లు లేకుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపినా, వాహనాలకు ధ్రువపత్రాలు లేకపోయినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వాపురం: వాహనాలు తనిఖీ చేపడుతున్న సీఐ రవీందర్


అశ్వారావుపేటరూరల్: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది


భద్రాచలంఅర్బన్: వాహనాల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్